ప్రజాశక్తి
శనివారం 24 జూన్ 2023 5
అనంతపురం



'పది' సప్లిమెంటరీ ఫలితాల్లో

అనంత 59.95, శ్రీ సత్యసాయి 57.78 శాతం ఉత్తీర్ణత


ప్రజాశక్తి-,అనంతపురం సిటీ

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం నాడు విడుదల అయ్యాయి. పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ అమరావతిలో వీటిని విడుదల చేశారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి 12,349 మంది పరీక్షరాయగా 7,403 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 59.95శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం తెలిపారు. ఇక శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి 10,164 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 5,873 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 57.78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌ఛార్జి డిఇఒ రంగస్వామి తెలిపారు.

- అనంత జిల్లా మీదుగా 554-డి రహదారి
- రోడ్డు ఏర్పాటుకు భూసేకరణ
- పరిహారంపై స్పష్టత కరువు
- సాగు భూములకు మొక్కుబడి పరిహారం



544-డి నిర్వాసితులకు న్యాయం చేయాలని రైతుసంఘం, నిర్వాసిత సంఘం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు



నిర్వాసితుల్లో అయోమయం

అనంతపురం జిల్లా మీదుగా జాతీయ రహదారి 544-డి విస్తరణ పనులు మొదలయ్యాయి. పనులు ప్రారంభమైనా పరిహారం విషయంలో స్పష్టత లేక నిర్వాసితుల్లో అయోమయం నెలకొంది. టెండరు ప్రక్రియ పూర్తయి సర్వే దాదాపు పూర్తయ్యింది. ఈ రోడ్డు ఏర్పాటు వల్ల ఇళ్లు, భూములు కోల్పోనున్న నిర్వాసితుల్లో పరిహారం పరిస్థితి ఏమిటన్న ఆందోళన మొదలైంది. మార్కింగ్‌లు చేసుకుంటూ పోతున్న అధికారులు పరిహారం విషయమై పెదవి విప్పడం లేదు. ఎంత పరిహారం ఇస్తారన్న దానిపై స్పష్టనివ్వకపోవడంతో గుబులు రేగుతోంది. పాత అంచనాల ప్రకారం కాకుండా విలువ ఆధారంగా పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం పాత అంచనాల ప్రకారమే పరిహారం పంపిణీకి సిద్ధపడ్డారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జాతీయ రహదారి 44 నుంచి జాతీయ రహదారి 16కు అంటే అనంతపురం నుంచి విజయవాడకు రహదారి విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. దీనికి 544-డి అని పేరుపెట్టారు. వాస్తవానికి ఇది 2014లోనే మంజూరైంది. అప్పట్లో ఈ ప్రక్రియ టెండరు దశ వరకూ వచ్చింది. ఈసమయంలో అనంతపురం నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్డ్ అంటే పూర్తిగా కొత్త రహదారి నిర్మాణం చేపట్టే ఆలోచనతో 544-డిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. 2019లో అధికారం మారాక గ్రీన్‌ఫీల్డ్‌కు ప్రభుత్వం స్వస్తి పలికింది. కొత్తగా బెంగళూరు - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను తెరపైకి తెచ్చింది. ఇది రావడంతో తిరిగి ఇప్పుడు 544-డి మళ్లీ తెరపైకి ఇచ్చింది. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యి అనంతపురం నుంచి భోగసముద్రం వరకు 69 కిలోమీటర్ల మేర ఈ జిల్లాలో రహదారి నిర్మాణం జరగనుంది. దీనికి భూసేకరణ జరగాల్సి ఉంది.

500 హెక్టార్ల భూమి అవసరం

అంతపురం నుంచి భోగసముద్రం వరకు నిర్మిస్తున్న 544-డి నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి సుమారు 500 హెక్టార్ల భూమి అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే ఉన్న భూమి కాకుండా ఇది అదనంగా అవసరమవనుందని అధికారులు చెబుతున్నారు.

పరిహారంపై స్పష్టతనివ్వని అధికారులు

ఏడు మండలాలు, 34 గ్రామాల గుండా ఈ రహదారి వెలుతోంది. అనంతపురం నుంచి ముచ్చుకోట వరకు ఒక ప్యాకేజీ, అక్కడి నుంచి భోగసముద్రం వరకు రెండో ప్యాకేజీ కింద పనులు చేపడుతున్నారు. అవసరమైన 500 హెక్టార్ల భూమిలో 85.102 హెక్టార్ల భూమి ఇప్పటికే అందుబాటులో ఉంది. తక్కిన 414.898 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఈ విస్తరణలో సుమారు 600 ఇళ్లు కూడా పోనున్నాయి. వీటి పరిహారం పైనే ఇప్పుడు ఆందోళన నడుస్తోంది.

2014 అంచనాల ప్రకారమే పరిహారం

2014 అంచనాల ప్రకారమే ఇప్పుడు పరిహారం ఇచ్చే అవకాశాలున్నట్టు అధికారులు చెబుతున్నారు. 2014లో మొదటి దఫా రహదారి మంజూరైన సమయంలోనే భూ సర్వే పూర్తయ్యి ఉండటంతో అప్పటి భూమి విలువ ప్రకారమే ఇప్పుడూ పరిహారం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారమే జాతీయ రహదారి సంస్థ రూ.156 కోట్లను మంజూరు చేసింది. అయితే ఇప్పుడు నిర్వాసితులు మాత్రం ఇప్పటి భూమి విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

జాతీయ రహదారి కింద భూములు ఇళ్లు, కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలి. భూమి కోల్పోతున్న రైతులకు సెంటుకు కనీసం రూ.50 వేలు ఇవ్వాలి. 2023 ధరల ప్రకారం ఇళ్లకు పరిహారం చెల్లించాలి. 2013 భూసేకర చట్టం ప్రకారం పరిహారమివ్వాలి దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే బాధిత రైతులు, ప్రజల పక్షాన పోరాటం సాగిస్తాం.

వి.శివారెడ్డి,
544-డి రోడ్డు నిర్వాసితుల కన్వీనర్.

విద్యుత్ భారాలపై 30న నిరసనలు

వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు ఈనెల 30వ తేదీన నిరసనలకు పిలుపునిచ్చాయి. శుక్రవారం ఉదయం స్థానిక గణేనాయక్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు పెద్దన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలను ప్రజలపై మోపేందుకు సిద్ధపడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.4500 కోట్ల భారం మోపిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మరింతగా రూ.12 వేల కోట్లు భారాన్ని సర్‌ఛార్జీ పేరుతో భారం మోపబోతోందని వెల్లడించారు. గతంలో విద్యుత్ భారాలను అధికంగా వినియోగించే సంపన్నులు, పరిశ్రమలకు పెరుగుదల అధికంగా ఉండేదని చెప్పారు. ఇప్పుడు భారాన్ని పేద, సామాన్య ప్రజలపైనా ఒకే రీతిన మోపేందుకు ఈ ప్రభుత్వం సిద్ధపడుతోందని చెప్పారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై రూ.50 వేల కోట్లు, వ్యవసాయ పంపుసెట్లకు రూ.18 వేల కోట్లు కలిపి మొత్తం రూ.68 వేల కోట్లు భారాన్ని మోపేందుకు సిద్ధపడుతోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ఆదానీ కంపెనీ కోసమే తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. మీటర్లు పెట్టడమే కాకుండా రాబోయే పది సంవత్సరాలు అదనపు భారాన్ని ప్రజలు భరించాల్సి ఉంటుందని వివరించారు. ప్రజలపై పడుతున్న ఈ భారాల వలన ప్రజలు ఏ రకంగా ఇబ్బందులు పడుతారన్న విషయం అధికార వైసిపి నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలపై పడుతున్న భారాలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఐక్య వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి ప్రజా సంఘాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఉద్యోగ, వ్యాపార సంఘాలు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఈనెల 27వ తేదీన నగరంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం 30వ తేదీన పవర్ ఆఫీసు వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ఉద్యోగ, కార్మికులతోపాటు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సిపిఐ న్యూడెమోక్రసీ నాయకులు వీరనారప్ప, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

ఒక్కఛాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

- వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం
- పెరిగిన హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు
- ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు
- రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం
- వచ్చే ఎన్నికల్లో వైసిపిని తరిమికొడదాం
- 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

2019 ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి, గడిచిన నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేశారని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు టిడిపి గ్యారెంటీ పేరుతో చేపట్టిన జోన్-5 ప్రచార బస్సుయాత్ర శుక్రవారం ఉదయం కదిరిలో ప్రారంభం అయ్యింది. కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సుయాత్రను ప్రారంభించారు. అనంతరం కదిరి దర్గాలో ముస్లిములతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ బస్సుయాత్ర రాయలసీమ సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా కాలేజ్ సర్కిల్ చేరుకుంది. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి జిల్లా టిడిపి అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బికె.పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజి మంత్రి ఫారుఖ్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నం హనుమంతరాయ చౌదిరి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, పరిటాల శ్రీరామ్, బండారు శ్రావణి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి నాయకులు ప్రసంగించారు. రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందు ఒక్క ఛాన్స్ పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టారన్నారు. అధికారం చేపట్టాక ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్యే ఇందుకు నిదర్శనం అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలకు అంతేలేదన్నారు. టిడిపి నేతలు అచ్చెం నాయుడు, కొల్లు రవీంద్రా, పట్టాభిరాము తదితరులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని గుర్తు చేశారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో ప్రసంగిస్తున్న బికె.పార్థసారథి

మినీమేనిఫెస్టోతో ప్రజలకు భరోసా..

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఇటీవల రాజమండ్రిలో జరిగిన మహానాడులో టిడిపి మినీమేనిఫెస్టో విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా మహిళల కోసం జిల్లాలో ఉచిత ప్రయాణ సదుపాయం, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం, బీసీల కోసం ప్రత్యేక చట్టం, అమ్మకు వందనం కార్యక్రమం ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అంతమందికి ఏడాదికి రూ.20వేల సాయం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3000 హామీలు ఇచ్చారన్నారు. దేశ చిత్రపటంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపాలంటే ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అన్నారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి వైసిపి అరాచకపాలన అంతం చేసి టిడిపిని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జెఎల్.మురళీధర్, నాయకులు సుధాకర్, దేవళ్ల మురళి, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను, కదిరి టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, ఎస్వీ నాగేంద్రప్రసాద్, తెలుగు యువత నాయకులు, గంగయ్య నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు రాజశేఖర్ బాబు, పాల్గొన్నారు.



స్కార్పియో వాహనంతో పట్టుబడిన యువకులు



స్కార్పియో వాహనంలో ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్‌ను చూపుతున్న యువకుడు

గంజాయి మత్తులో

యువకుల హల్‌చల్

అతివేగంతో స్కార్పియో డ్రైవింగ్ వాహనంలో ఎమ్మెల్యే స్టిక్కర్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

గంజాయి మత్తులో ఐదుగురు యువకులు ముదిగుబ్బ సమీపంలో శుక్రవారం సాయంత్రం హల్‌చల్ చేశారు. అతివేగంతో స్కార్పియో వాహనాన్ని నడిపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. స్థానికులు 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్నం పోలీసులు వీరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఐదుగురు యువకులు ఎపి09 సిహెచ్2373 నెంబర్‌గల వాహనంలో కదిరి నుంచి అనంతపురం వైపునకు ప్రయాణిస్తున్నారు. గంజాయి మత్తులో ఉన్న వీరు అతివేగంతో వాహనం నడుపుతున్నారు. పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలసముద్రం గ్రామం సమీపాన ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడుని ఇన్నోవాలో వెళ్తున్న యువకులు అడ్డగించారు. ద్విచక్రవాహనదారున్ని బెదిరించి అతని నుంచి ఫోన్‌పే ద్వారా రూ.18 వేలను వారి ఖాతాలోకి బలవంతంగా వేయించుకున్నారు. అక్కడి నుంచి ముదిగుబ్బ వైపు అతివేగంగా ప్రయాణించారు. ముదిగుబ్బ సమీపంలో ఒక ఆటోను వేగంగా ఢీ కొనడంతో ఆటోలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఇలా అతివేగంతో స్కార్పియో వాహనం అనంతపురం వైపునకు వెళ్తుండగా స్థానికులు 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు కాకతీయ పాఠశాల వద్ద జెసిబిని రోడ్డుకు అడ్డుపెట్టి ఇన్నోవా వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంతో సహా అందులో ఉన్న యువకులను పట్నం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. వాహనాన్ని పరిశీలించగా అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే స్టిక్కర్ లభించింది. ఈ యువకులు అనంతపురం నగరం శారదానగర్‌కు చెందిన షేక్ ఫరీద్, నాగభాస్కర్, జి.కార్తీక్, డి.కార్తీక్‌గా తాడిపత్రికి చెందిన దిలీప్ గుర్తించారు. ఈ యువకులు ఎవరు.? ఇందులో ఎమ్మెల్యే స్టిక్కర్ ఎందుకు ఉందన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇంటింటికీ జగనన్న సురక్ష

కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలను అందజేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జెడ్పీ సిఇఒ భాస్కర్‌రెడ్డితో కలిసి పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నాడు లాంఛనంగా ప్రారంభించారన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతున్నందున ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు తెలిపారు. ఇదివరకే సచివాలయ సిబ్బంది వాలంటీర్లకు కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలో దీనిపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. దీనికోసం పట్టణ, గ్రామీణ పరిధిలో రెండు బందాల ఏర్పాటు మండల స్థాయిలో ఎంపీడీవో డిప్యూటీ తహశీల్దార్ ఒక బందం, తహశీల్దార్ పంచాయతీరాజ్ ఈవోలతో కూడిన మరో బందాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమం పర్యవేక్షణకై నియోజకవర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. శనివారం నుంచి ముందస్తు ప్రణాళిక బద్ధంగా జిల్లాలో ఉన్న 663 సచివాలయాల్లో ఉన్న వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై ప్రతి ఇంటినీ సందర్శించి అర్హులై ఉండి ఎక్కడైనా ప్రభుత్వ పథకాల లబ్ధి అందని వారుంటే అలాంటి కుటుంబాలను గుర్తించి సమస్యల పరిష్కారానికి వివరాలను సేకరిస్తారన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, సిసిఆర్‌సి రేషన్ కార్డు హౌస్ హోల్డ్ తదితర 11 రకాల సేవల పత్రాలను తీసుకుని ఆయా దరఖాస్తుల ద్వారా సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పించి టోకెన్ నెంబర్ సర్వీస్ రిక్వెస్ట్ ద్వారా ఉచితంగా వారికి సేవలు అందించాల్సి ఉందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

కంకర సరఫరా సక్రమంగా జరగాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో జరుగుతున్న జగనన్న హౌసింగ్ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అవసరమైన మేరకు నాణ్యమైన కంకరను సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని క్వారీ, కంకర యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ కాలనీలో అవసరమేరకు ఉన్న 20 ఎంఎం, 12 ఎంఎం, 6 ఎంఎం రాయితోపాటు డస్టును సరఫరా చేసే క్రమంలో ఎలాంటి లోటుపాటు ఇవ్వకుండా సకాలంలో సరఫరా చేయాలని సూచించారు. ఇదివరకు సరఫరా చేసిన వాటికి బిల్లులను సత్వరమే చెల్లిస్తామని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న రాయదుర్గం, తాడిపత్రి, బొమ్మనహాల్, అనంతపురం, గుత్తి తదితర కంకర యాజమాన్యం వారు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకొచ్చారు. వీటి పరిష్కారానికి తనవంతు కషి చేస్తామని జెసి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశులు, ఏడీ నాగయ్య, ఏడీ విజిలెన్స్ విజయలక్ష్మి, అసిస్టెంట్ జియాలాజిస్ట్ రామకష్ణ ప్రసాద్, క్వారీ, కంకర యాజమాన్యాల ప్రతినిధులు వెంకట నాయుడు, అశోక్, రాఘవేంద్ర, విశ్వనాథ్ పాల్గొన్నారు.

30న విజయవాడలో మహా ధర్నా

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 30న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో వెనుకబడిన జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలన్నారు. 2022 ఖరీఫ్ రబీ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ పంటల బీమా విడుదల చేయాలని, 0 వడ్డీ పథకం 2 లక్షలకు, పావలా వడ్డీ పథకం ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కనీసం పెట్టుబడులు కూడా చాలడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ధరలపై అదనంగా రూ.20 బోనస్‌గా ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే పద్ధతిని నిలుపుదల చేసి ఉచిత విద్యుత్‌ను యథావిధిగా కొనసాగించాలన్నారు. డ్రిప్‌చ స్ప్రింక్లర్లకు జీఎస్టీని రద్దు చేసి ప్రతి రైతుకూ 90 సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో కౌలు రైతులందరికీ గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాలకు వర్తింజేచేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాకు జిల్లా నుంచి రైతు సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నరసింహారెడ్డి, వన్నూరప్ప, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : విప్ కాపు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని దేవగిరిలో సర్పంచి కరూరు కవితమ్మ ఆధ్వర్యంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేయాలని, ఓ మహిళ అడిగిన ప్రశ్నకు వారు సమాధానం చెబుతూ నగరాల్లో ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేసే ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటే ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందన్నారు. అలాగే కణేకలు, బళ్లారి ప్రధాన రహదారి డబుల్ రోడ్డులో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు వేయించాలని క్రాస్ ప్రజలు కోరారు. ఇందుకు విప్ స్పందిస్తూ వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు కోటేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ కన్వీనర్ జొంపునాయుడు, రామాంజనేయరెడ్డి, బొమ్మనహాల్ రమేష్, ఫొటో స్టూడియో బసవరాజ్, సచివాలయ ఉద్యోగులు, వైద్యసిబ్బంది, శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ, తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కెజిబివి గెస్ట్ ఫ్యాకల్టీలను కొనసాగించాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కెజిబివిల్లో పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలను యథావిధిగా కొనసాగించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు తొలగించడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఎస్ఎస్ఏలో గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించే ఆలోచన విరమించాలన్నారు. వారిని కొనసాగించి మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాకాదని గెస్ట్ ఫ్యాకల్టీని తొలగిస్తామంటే సహించేది లేదని, ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తుంగభద్ర ప్రధాన కాలువ పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని తుంగభద్ర ప్రధాన కాలువను హెచ్‌ఎల్‌సి ఇఇ వెంకట్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఆంధ్రా సరిహద్దు 105 కిలోమీటర్ నుంచి కనేకల్ సెక్షన్ వరకూ ఉన్న ప్రధాన కాలువను ఉపాధి హామీ పథకంతో కలిపి మరమ్మతులు చేయడానికి నిర్ధారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పిచ్చి మొక్కలతోపాటు చిన్న, చిన్న మరమ్మతులు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కాలువను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనేకల్ సెక్షన్ డిఇ గోపాల్‌నాయక్, జెఇలు, హెచ్‌ఎల్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న హెచ్‌ఎల్‌సి ఇఇ వెంకటరెడ్డి

గ్రంథాలయాల సమస్యలు పరిష్కరించాలి

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ప్రసన్నకుమార్‌కు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ప్రసన్నకుమార్‌కు రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ల ఫోరమ్ అధ్యక్షులు ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయంలో ఫోరమ్ సభ్యులతో వెళ్లి డైరెక్టర్‌కు గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలపై వివరించారు. 13 జిల్లాల గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆయా గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. 2 సంవత్సరాల నుంచి ఆన్ డిమాండ్ బుక్స్ కొనుగోలు చేయకపోవడంతో పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జనరల్ బుక్స్ కూడా కొనుగోలు చేయాలన్నారు. స్వీపర్స్ జీతాలు పెంచేలా చూడాలని, అవసరం బట్టి ఇద్దరు స్వీపర్లను నియమించాలన్నారు. అద్దె భవనాల్లో ఉన్న గ్రంథాలయాలకు అద్దెలు పెంపుదల చేయాలన్నారు. గ్రంథాలయాలు లేని గ్రామాల్లో బిడిసి పుస్తక నిక్షిప్త కేంద్రాలను ఏర్పాటు చేయడానికి బడ్జెట్ కేటాయించాలని కోరారు.



డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి

రూ.25లక్షలతో సీసీ రోడ్డు పనులు

ఉరవకొండ : మండలంలోని నెరిమెట్ల గ్రామంలో రూ.25లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు సర్పంచి యోగేంద్రరెడ్డి తెలిపారు. ఈమేరకు రోడ్ల నిర్మాణం పనులను పంచాయతీ కార్యదర్శి మహేష్‌తో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి ఈఏడాది సీసీ రోడ్లు నిర్మించడానికి ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరితగతిన నాణ్యతతో పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థి కిరణ్‌కు శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెసి.హరికుమార్

యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

గుంతకల్లు : నేటి పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఏరంగంలోనైనా రాణించే అవకాశం ఉందని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెసి.హరికుమార్, ప్రిన్సిపాల్ పి.గోపాల్ తెలిపారు. బిబిఎ చివరి సంవత్సరం చదువుతున్న కట్టా కిరణ్ హైదరాబాద్‌లోని గిరినార్ సాఫ్ట్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో శుక్రవారం స్థానిక కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి సారిస్తే ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. ప్రతి విద్యార్థికీ ఖచ్చితమైన ప్రణాళిక ఉండాలన్నారు. అప్పుడే ప్రఖ్యాత కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. తమ కళాశాలలో చదివే విద్యార్థి కట్టా కిరణ్‌కు రూ.3 లక్షల వార్షిక వేతనంతో ప్రముఖ కంపెనీలో ఉద్యోగం లభించడం ఆనందంగా ఉందన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో కళాశాల కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ వరప్రసాద్, శిక్షణ అధికారి కె.రాకేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బసెట్టి క్రిష్టయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-గుత్తి

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. అలాగే వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ యాప్ కొత్త వర్షన్‌ను మార్చు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు, అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకులు నాగరాజు, రమేష్, గుత్తి ప్రాజెక్టు నాయకురాళ్లు రేష్మా, గంగా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

వ్యాధుల వివరాలను జిల్లాకేంద్రానికి పంపాలి

డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ వీరబ్బాయి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు సంక్రమిత, గుర్తింపు పొందిన వ్యాధుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లాకేంద్రానికి సమాచారం పంపించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి సూచించారు. శుక్రవారం నగరంలోని అమరావతి, చంద్ర, అండ్ కేర్ క్యూర్ తదితర ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా ఆసుపత్రుల్లో పొందుపరిచిన రోగుల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రయివేటు ఆసుపత్రుల వారు వైద్య ఆరోగ్యశాఖ సూచించిన పోర్టల్‌లో రోజూ సంక్రమిత, గుర్తింపు పొందిన వ్యాధుల సమాచారాన్ని తప్పకుండా పంపించాలని ఆదేశించారు. ఈ సమాచారం ప్రయివేట్ ఆసుపత్రుల వారు పంపడం వల్ల గ్రామస్థాయిలో, పట్టణ స్థాయిలో వ్యాధుల గుర్తింపు, తీవ్రతను అంచనా వేసి వ్యాప్తిని తగ్గించడం సులభతరం అవుతుందన్నారు. ఇదివరకు ఈ వ్యాధుల గుర్తింపు కేవలం ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రమే జరిగేదన్నారు. ఇప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా ప్రతి ప్రయివేట్ ఆస్పత్రి వారు కూడా సమాచారం తప్పకుండా పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో ఉమాపతి, త్యాగరాజు, ఎపి డమాలజిస్ట్ వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ వీరబ్బాయి

ప్రాణాలు కాపాడటంలో రక్తదాతల పాత్ర అమోఘం

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గంభీర రఘునందన్

ప్రజాశక్తి-అనంతపురం

ఆపదలో ఉన్న వారికి రక్తం అందించే రక్తదాల సేవలు అమోఘమని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గంభీర రఘునందన్ కొనియాడారు. 2022-23లో ప్రభుత్వ సర్వజన వైద్యశాలల్లోని రక్తనిధి కేంద్రంలో అత్యధిక సార్లు రక్తదానం చేసిన దాతలు, రక్తదాతలను ప్రోత్సహించి రక్తదానం చేయించిన వారిని బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మూడేళ్లుగా వరుసగా రాష్ట్రంలోనే ఉత్తమ బ్లడ్‌బ్యాంకుగా అవార్డు సంపాదించిన అత్యుత్తమ బ్లడ్‌బ్యాంకు మనదే అన్నారు. ఇందుకు బ్లడ్‌బ్యాంకు సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. ముఖ్యంగా మానవతా దృక్పథంతో స్వయంగా రక్తదానం చేస్తూ ఎంతోమందిని రక్తదానం చేసేలా ప్రోత్సహించిన స్ఫూర్తిప్రదాతలకు సన్మానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మానవతా రక్తదాతల సంస్థ అధ్యక్షులు తరిమెల అమర్నాథ్‌రెడ్డి, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ చినపుల్లయ్య, మమతా బ్లడ్ డోనేర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు నవీన్‌కుమార్, తదితరులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మాలకొండ భవాని, డాక్టర్ శ్రావణి, డాక్టర్ దివ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కోఆర్డినేటర్ వెంకటరమణ, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రమణారెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గంభీర రఘునందన్

గందరగోళంగా పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-ఉరవకొండ

సర్పంచి లలిత అధ్యక్షతన నిర్వహించిన మేజర్ గ్రామ పంచాయతీ సమావేశం శుక్రవారం రసాభాసగా సాగింది. సమావేశం ప్రారంభం కాగానే వార్డు సభ్యులు రామాంజనేయులు, ప్రభాకర్, రవి, మాధవి మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి జనరల్ ఫండ్ నిధులు ఎంత ఖర్చు పెట్టారు, దేనికి ఖర్చు పెట్టారో వివరాలు అందించాలని ఇఒ గౌస్‌సాబ్‌కు కోరారు. ఇందుకు ఇఒ స్పందిస్తూ సమావేశం అనంతరం ఖర్చులకు సంబంధించిన వివరాలు అందిస్తామని చెప్పడంతో ప్రతి సమావేశంలో ఇదే సమాధానం చెబుతున్నారని వివరాలు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు వివరాలు అందించేంత వరకు సమావేశాన్ని జరగనివ్వమని ఆవరణలో కింద కూర్చుని నిరసన తెలిపారు. అలాగే వార్డు సభ్యురాలు మాధవి మాట్లాడుతూ తమ వార్డులో 15 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతున్నా పట్టించుకోవడం లేదని నిలదీశారు. సభ్యులు తమ సమస్యలను ప్రస్తావిస్తుండగానే జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నందున ఇఒ అర్ధాంతరంగా వాయిదా వేస్తున్నామని చెప్పడంతో వార్డు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వార్డు సభ్యులు కార్యాలయంలోనే నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కరించకుండా సభ్యులను అవమానపరిచే విధంగా గ్రామ కార్యదర్శి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలో తాగనీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు, డ్రెయినేజీలతోపాటు అనేక ప్రజా సమస్యలు సమావేశంలో చర్చించాల్సి ఉండగా సమావేశాన్ని వాయిదా వేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచి వన్నప్ప, వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో వాగ్వివాదం చేస్తున్న సభ్యులు

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సుబ్రమణ్యం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పశుపోషకులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో పశుబీమా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులు, ప్రమాదవశాత్తు పశువులు, జీవాలు, పందులు మరణిస్తే రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం బీమా పథకాన్ని రూపొందించిందన్నారు. అయితే లబ్ధిదారుల వాటా తెల్లరేషన్ కార్డు ఉన్న రైతులు 20 శాతం, లేని వారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందన్నారు. పశువులకు మూడేళ్ల పాటు, జీవాలు, పందులకు ఒకటి, రెండు, మూడు సంవత్సరాల పాటు బీమా పథకం వర్తిస్తుందన్నారు. దేశవాళీ, సంకరజాతి, ఆడ, మగ పశువులకు రూ.30వేలు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15వేలు, గొర్రెలు, మేకలు, పందులకు రూ.6వేల వరకూ ఒక సంవత్సరానికి రూ.40, మూడు సంవత్సరాలకు రూ.78 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, బుక్కరాయసముద్రం ఏరియా వెటర్నరీ ఆసుపత్రి ఎడి రత్నకుమార్, ఏరియా పరిధిలోని డాక్టర్లు రాధిక, గోవిందరాజు, ఎంపిపి సునీత, జడ్పీటిసి భాస్కర్, ఎంపిడిఒ విజయభాస్కర్, ప్రత్యేకాధికారిణి శ్రీదేవి, సర్పంచి పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

తెలుగు రాష్ట్రాల్లో 'నాట్స్' సేవలు

నార్త్ అమెరికా తెలుగు సొసైటీ అధ్యక్షులు బాపయ్యచౌదరి

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగు రాష్ట్రాల్లో నార్త్ అమెరిగా తెలుగు సొసైటీ ద్వారా విస్తృత సేవలు చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షులు బాపయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009లో ఏర్పాటైన నార్త్ అమెరికా తెలుగు సొసైటీ ద్వారా తెలుగువారి సంక్షేమమే ధ్యేయంగా, తెలుగు భాష పరిరక్షణ లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆందులో భాగంగా జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంయుక్తంగా కలిసి పలు కార్యక్రమాలు చేసేందుకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఆర్డీటీ డైరెక్టర్ మాంచూ ఫెర్రర్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో విలేజ్ డెవలప్‌మెంట్ లక్ష్యంగా 'మన గ్రామం మన బాధ్యత' అనే నినాదంతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అమెరికాలోని తెలుగువారి సంరక్షణ కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా 1888-4 తెలుగు టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో నాట్స్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పలు ఉచిత వైద్య శిబిరాలు, ఐ క్యాంపులు, విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలరిషిప్‌లు ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, సుబ్బారావు, నారాయణరెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నార్త్ అమెరికా తెలుగు సొసైటీ అధ్యక్షులు బాపయ్యచౌదరి

జిల్లాకు చేరిన ఎరువులు

ప్రజాశక్తి-అనంతపురం

రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన స్పిక్ ఎరువులు శుక్రవారం జిల్లాకు చేరినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి తెలిపారు. జిల్లాకు వచ్చిన ఎరువుల్లో స్పిక్ యూరియా 305 మెట్రిక్ టన్నులు, డిఎపి 710 మెట్రిక్ టన్నులు, 192 మెట్రిక్ టన్నుల 20.20.0.13 ఎరువులను స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్ నుంచి అన్‌లోడ్ చేయించి కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిరుగుప్ప ఆగ్రో ఏజెన్సీ హోల్‌సెల్ డీలర్ సిరుగుప్ప వెంకటేష్, రాప్తాడు మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, స్పిక్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



జిల్లాకే చేరిన స్పిక్ ఎరువులను పరిశీలిస్తున్న అనంతపురం ఎడిఎ ఎం.రవి



కలెక్టర్ గౌతమికి వినతిపత్రం సమర్పిస్తున్న విఆర్ఎ సంఘం నాయకులు

విఆర్ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

కలెక్టర్ గౌతమికి వినతి

అనంతపురం కలెక్టరేట్ : గ్రామ రెవెన్యూ సహాయకులకు విఆర్ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలని విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకులు ఎన్.పెద్దన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం విఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ అనంతపురం, గుంతకల్, కళ్యాణదుర్గం, పరిధిలోని గ్రామ రెవెన్యూ సహాయకులకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. 5 నుంచి 10 సంవత్సరాల సర్వీస్ ఉన్న విఆర్ఎలకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే నిర్వహించే గ్రామాల్లో పని చేస్తున్న విఆర్ఎలకు టిఎ, డిఎలు ఇవ్వాలన్నారు. అలాగే కారుణ్య నియామకాలు ద్వారా పోస్టులు కల్పించాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంపిపి

ఆత్మకూరు : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపిపి హేమలత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నిర్దేశించిన మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్‌ప్రసాద్, తహశీల్దార్ షర్మిల, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ ఎఒగా సాయికుమార్

బొమ్మనహాల్ : మండల వ్యవసాయ అధికారిగా సాయికుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న అహ్మద్‌బాషా బదిలీపై రాయదుర్గం వెళ్లడంతో సాయికుమార్‌ను ఇక్కడిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తామనన్నారు. ముఖ్యంగా రైతులు క్రిమి సంహారక, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. పశువుల పెంట, కోడిపెంటను పంటలకు వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలన్నారు. ముఖ్యంగా ఎంఆర్‌పి ధరలకే ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయించాలన్నారు. అలాగే దుకాణాల వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు.

టెన్త్ టాపర్లకు సన్మానం

శింగనమల : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మొదటి స్థానం సాధించిన ఒంటెద్దు ఐశ్వర్యను మెడల్‌తో సన్మానించడంతో పాటు రూ.3వేల నగదు అందించారు. 2వ స్థానం సాధించిన ఆకులేడు చిన్నయ్య, చరిష్మా, 3వ స్థానం సాధించిన సలకంచెరువు పార్నపల్లి పవిత్రను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం : పట్టణంలోని ప్రయివేటు ఐటిఐ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కుల జాబితా, రికార్డులు, అటెండెన్స్, ఫీజులు అని రకరకాల పేర్లు చెప్పి కళాశాల యాజమాన్యం విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తోందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి భారత ఐటిఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, అరవింద్, మధు, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

పశుబీమాతో ఉపయోగం

బెలుగుప్ప : రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రమేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల మరణాలు సంభవించినప్పుడు రైతు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం పశుబీమా పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. వీటిని పశుపోషకులు, గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సాలీబాయి, గంగానాయక్, పాతన్న, ఎంపిటిసి ఈశ్వరప్ప, పశువైద్య సిబ్బంది ఎర్రిస్వామి, రైతులు, గొర్రెల కాపరులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ సేవలు మరువలేనివి

కర్నూలులో ఘన సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లావాసిగా అనంతతోపాటు కర్నూలు మెడికల్ కళాశాలల్లో ప్రొఫెసర్‌గా సేవలందించడమే కాకుండా, పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు తెప్పించడంతో మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్ సేవలు మరువలేనివని కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సూపరింటెండెంట్ నరేంద్రనాథ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సాయిసుధీర్ కొనియాడారు. పీజీ సీట్ల భర్తీ కోసం ఎండ్లూరి ప్రభాకర్ చేసిన కృషిని హర్షిస్తూ శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంత వైద్య కళాశాలలో సుమారు 20 సంవత్సరాలకు పైగా సైకియాట్రి విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేయడంతోపాటు సైకియాట్రి పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు తెప్పించి రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు కలిగిన మూడవ కళాశాలగా అనంత వైద్య కళాశాలను తీర్చిదిద్ది ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అలాగే కర్నూల్ మెడికల్ కాలేజీ సైకియాట్రీ చదువుకుని అక్కడే ప్రొఫెసర్‌గా పని చేసిన చరిత్ర కూడా ఆయనదే అన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. రాబోవు వైద్యులకు ఆయన ఆదర్శమన్నారు.



మానసిక వైద్యులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్‌ను సన్మానిస్తున్న వైద్యులు

కింద పడి మహిళ మృతి

గుత్తి : ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని ఉబిచెర్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిన్న సుంకన్న, భార్య లక్ష్మీదేవి గుత్తికి రావడానికి ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



పేదలకు అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి, సభ్యులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ చిన్న టీ స్టాల్ నడుపుతున్న యువకుడు రాజు తండ్రి భీమయ్య జ్ఞాపకార్థం అన్నదానం చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో వైద్య చికిత్సల కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పేదల ఆకలి తీర్చడానికి బాధ్యతగా కృషి చేస్తున్నామన్నారు. వీలున్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా పేదలకు అన్నదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నాగమ్మ, నబిరసూల్, సుబ్రమణ్యం, కిష్టప్ప, ఓబులపతి, నల్లప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కనకదాస విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో కనకదాస విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కురుబ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కురుబ సంఘం నాయకులు మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన కనకదాస విగ్రహాన్ని రోడ్ల విస్తీరణ పేరుతో తొలగించి పంచాయతీ కార్యాలయంలో ఉంచారన్నారు. అయితే అక్కడ విగ్రహం శిథిలావస్థకు చేరుకుని చెయ్యి విరిగిందన్నారు. కావున ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో విగ్రహానికి అయ్యే ఖర్చు మొత్తం గ్రామపంచాయతీ అధికారులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో అక్కడికి చేరుకున్న పంచాయతీ అధికారులతో కురుబ సంఘం నాయకులు వాగ్వివాదానికి దిగారు. సమాచారం అందుకున్న ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కురుబ సంఘం నాయకులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

బదిలీ ప్రధానోపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి-బెలుగుప్ప

బదిలీపై వెళ్తున్న మండల పరిధిలోని దుద్దేకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా శాలువాలు కప్పి, పూలమాలల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులకు మంచి క్రమశిక్షణలో పెట్టడతోపాటు విద్యాబుద్ధులు నేర్పి మంచిస్థానంలో ఉండేందుకు ఎంతో కృషి చేసిన మల్లికార్జున బదిలీ కావడం బాధాకరమన్నారు. అయితే ఉపాధ్యాయులకు బదిలీ సర్వసాధారణమని, ఆయన ఎక్కడ ఉన్నా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సర్పంచి రత్నమ్మ, పాఠశాల కమిటీ ఛైర్మన్ రామన్న ప్రధానోపాధ్యాయులు బాలమురళీకృష్ణ, దేవనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునను సన్మానిస్తున్న దృశ్యం

'జగనన్న సురక్ష'తో అర్హులకు న్యాయం

ప్రారంభ కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు దరి చేరి మేలు జరుగుతుందని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. శుక్రవారం నగరంలోని 53 సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని సూచించారు. ఏవైనా కారణాల వల్ల ఎవరైనా అర్హులకు సంక్షేమ పథకాలు అందనట్లయితే వారికి పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యకమానికి సిఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ సేవలకు సంబంధించి అవసరమైన పత్రాలు వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రజల వద్దకు నేరుగా వలంటీర్లు, సచివాలయ గృహసారథులను వెళ్లి ప్రజా సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకాన్ని శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ దివాకర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వాలంటర్లు, గృహ సారథులు జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని చామలూరులో గ్రామంలో పర్యటించి ప్రజలను సమస్యలు, పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, వైస్ ఎంపిపి మల్లేశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి మాధవీలత, సచివాలయ సిబ్బంది సుధాకర్, ప్రభావతి, దిల్షాద్ బీ రియాజ్, జయసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాష్ట్ర సచివాలయంలో సిఎం జగన్ ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని పాత మీసేవ సెంటర్‌లో ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళుశిల్ప, వైసిపి రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాసరెడ్డి , గౌని లావణ్య, షాబిరాబి, మున్సిపల్ కో ఆప్షన్ నజీర్, వార్డు ఇన్‌ఛార్జి పోరాళుశివ, బషీర్, గౌని శ్రీరామరెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శుక్రవారం విడపనకల్లు మండలం గడేకల్ గ్రామ సచివాలయం-1, 2కు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతుభరోసా కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అర్హత ఉండి వివిధ కారణాలు, టెక్నికల్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులను గుర్తించి పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సోమయ్య, సర్పంచి సుశీల ఉమాశంకర్, ఎంబిసీ కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేసులు, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, ఎంపిటిసి ఓబులేసు, వైసీపీ నాయకులు కరణం భీమిరెడ్డి, రాముడు, మాళ్యం ఎర్రన్న, ప్రసాద్, ఉమాశంకర్, సచివాలయం సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ ఒక్క అర్హుడికీ అందుకుండా ఉండకూడదని ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మండల ఉపాధ్యక్షురాలు యన్నం నీలిమ అతికిరెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పడమటి యాలేరు సచివాలయంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతికిరెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్పంచి ఆరోగ్యం రెడ్డి మాట్లాడుతూ వాలంటీర్లు, నాయకులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి క్షుణ్ణంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌వలి, గ్రామ సచివాలయ సిబ్బంది, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ కె.నందిని, మండల సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

శింగనమల : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని తెలుసుకుని ఎవరికైనా అందకుంటే అందిచేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సిఎం జగన్ ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల స్థాయిలో అందించే 11 సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.నారాయణ, గాండ్లసంఘం రాష్ట్ర డైరెక్టర్ గాండ్ల నరసయ్య, ఎంఎల్‌ఒ రామాంజనేయులు, జెసిఎస్ మండల కన్వీనర్ శివపురం వెంకటరమణ, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటరీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శింగనమల కార్యక్రమంలో పాల్గొన్న డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, అధికారులు, నాయకులు

రాజకీయాల్లోనూ పవన్ హీరోనే..

జనసేన నాయకులు బాబురావు, గ్రంధి దివాకర్, కుమ్మర నాగేంద్ర

ప్రజాశక్తి-అనంతపురం

నీతి, నిజాయితీ, సమస్యలపై అవగాహన, పరిష్కారం పట్ల చిత్తశుద్ధి, ప్రజలంటే అంకితభావం కలిగిన జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సినిమాల్లోనే కాదు.. రాజకీయాల్లో కూడా హీరోనే అని జనసేన నగర అధ్యక్షులు బాబురావు, నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముద్రగడ పవన్‌కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. కాపులను తన స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్న ముద్రగడ ఎక్కడా.. తన విలాసవంత మైన జీవితాన్ని పక్కనపెట్టి అన్నివర్గాలతో పాటు కాపుల అభ్యున్నతికి కృషి చేస్తున్న పవన్ ఎక్కడా అని ఎద్దేవా చేశారు. కాపులను కాపు కాసేది పవనుడు ఒక్కడే అన్నారు. ఎప్పుడైతే తాడేపల్లి ప్యాలెస్ పంపిన లేఖలను సంతకం చేసి ఫార్వర్డ్ చేశావో అప్పుడే ఇంతకాలం నువ్వు వేసుకున్న ముసుగు తొలిగిపోయిందన్నారు. నాయకత్వం అంటే స్వార్థ ప్రయోజనాలు చూసుకోవడం కాదని, నమ్మిన వారి కోసం త్యాగం చేయడం అన్నారు. అలాంటి నాయకత్వ సుగుణాలు కలిగిన పవన్‌కళ్యాణ్ సారథ్యంలోని జనసేన వెంటే యావత్తు కాపు సమాజం నడుస్తుందన్నారు. పవన్ కళ్యాణ్‌పై అనవసర వ్యక్తిగత ఆరోపణలు చేసిన ప్రతి ఒక్క రికీ వడ్డీతో సహా చెల్లించే సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జనసైనికులందరూ పనిచేస్తే వైసిపి ప్రభుత్వం పునాదులు కూల్చడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజయ్, సిద్ధు, విజయ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాషా, కార్యదర్శులు లాల్‌స్వామి, శేషాద్రి, వెంకటరమణ, ఆకుల అశోక్, నాయకులు హిద్దు, హరీష్ (రుద్రంపేట) తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలోని విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకుని రెడ్‌క్రాస్ సంస్థను బలోపేతం కోసం తోడ్పాటు అందించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యాసంస్థల విద్యార్థులు జూనియర్, యూత్ రెడ్ క్రాస్ విభాగంలో సభ్యత్వం తీసుకుని రెడ్‌క్రాస్ చేసే సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే సేవాగుణం, సేవాతత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు, విద్యా విభాగాధిపతులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా విద్య, వృత్తి విద్య శాఖలు, ప్రాంతీయ తనిఖీ అధికారి, శ్రీకృష్ణ దేవరాయల యూనివర్శిటీ, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతోపాటు వారి పరిధిలోని అన్ని విద్యాసంస్థలు జూనియర్ యూత్ రెడ్‌క్రాస్ విభాగంలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ సంస్థ వైస్ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణప్రసాద్, జిల్లా సెక్రటరీ హరిణిరెడ్డి, మోహన్‌కృష్ణ, ఆయా విద్యాసంస్థల అధికారులు తదితరులు పాల్గొన్నారు.